అధనం చెల్లిస్తేనే.. సిలిండర్

- రసీదు రూ.922..వసూలు చేసేది రూ.970
- బుక్ చేయకపోతే రూ.1,050
- బ్లాక్ మార్కెట్‌లో ఒక్క సిలిండర్ ధర రూ.1,200

బొమ్మనహాళ్: వంటింట్లో గ్యాస్ లేనిదే పూట గడవదు.. వినియోగదారుల అవసరాన్ని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు, డెలివరీ బాయ్స్ క్యాష్ చేసుకుంటున్నారు. 'అధనం' చెల్లిస్తేనే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నారు. దీంతో వినియోగదారులకు మరింత భారం పడుతోంది. రశీదు ఇచ్చేది రూ.922 అయితే..రూ.970 వసూలు చేస్తున్నారు. కొన్నిచోట్ల గృహ వినియోగం కోసం సరఫరా చేసే సిలిండర్లను కమర్షియల్‌గా విక్రయిస్తున్నారు. దీనికితోడు ఇళ్లకు సిలిండర్ డెలవరీ కావాలంటే ఐదు రోజులు పడుతోందని, ఫాస్టుఫుడ్ సెంటర్లు, హోటళ్లకు గంటల వ్యవధిలోనే అందిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సిలిండర్ బుక్ చేసుకోకపోతే రూ.1050, బ్లాక్ మార్కెట్‌లో సిలిండర్ ధర రూ.1200 చొప్పున వసూలు చేస్తున్నారు. మండలంలో 8,500 పైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. రోజూ 350 నుంచి 400 వరకు గ్యాస్ సిలిండర్లు అమ్ముడవుతున్నాయి. ఏజెన్సీ నిర్వాహకులు ఆటోలు, వ్యాన్‌ల ద్వారా గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. డెలివరీ చార్జీల పేరుతో వినియోగదారులపై అదనపు భారం మోపుతున్నారు. ఇంటి వద్ద సిలిండర్ డెలివరీ చేస్తే బిల్ పైన రూ. 50 నుంచి రూ.100 అదనంగా దండుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు పదుల సంఖ్యలో గ్యాస్ సిలిండర్లు కొందరికి ఇచ్చి, వారితో వ్యాపారం చేయిస్తున్నారు. గ్యాస్ వ్యాన్ ఐదు రోజుల పాటు రాకపోతే వీరి ద్వారా ఎక్కువ ధరకు సిలిండర్లను అమ్ముతున్నారు. ఒక్కో సిలిండర్ రూ.1,200తో విక్రయిస్తున్నారు. మామూళ్ల మత్తులో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇష్టారాజ్యంగా సిలిండర్లు డెలివరీ పేరుతో అదనంగా వసూలు చేస్తున్నా పట్టించుకునేవారు లేరన్న విమర్శలు ఉన్నాయి.



గ్యాస్ సిలిండర్లను సరఫరా చేస్తున్న దృశ్యం

అదనంగా వసూలు చేస్తున్నారు



గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోగా డెలవరీకి రూ.1,000 తీసుకున్నారు. బుక్ చేసినప్పుడు నాకు వచ్చిన మెసేజ్‌లో ఇచ్చిన రసీదులో రూ.922 మాత్రమే ఉంది. డెలివరీ బాయ్‌ని అడిగితే బిల్లు ధర ఉండేది ఇస్తే డీజిల్ బంకు మా ఇంట్లో ఉందా? అంటూ ఎదురు ప్రశ్నిస్తున్నారు. డీజిల్ రేట్లు పెరగడంతో డెలివరీ చార్జీలు పెంచామంటున్నారు.

– నాగవేణి, గోవిందవాడ గ్రామం, బొమ్మనహాళ్ మండలం

ఐదు రోజులకు ఇచ్చారు



గ్యాస్ సిలిండర్ బుక్ చేసిన ఐదు రోజుల తర్వాత సరఫరా చేశారు. సిలిండర్ కోసం నాలుగు రోజుల పాటు డబ్బులు ఉంచుకున్నా. ఐదో రోజు డబ్బు అవసరానికి వాడుకుంటే అప్పుడు వచ్చి గ్యాస్ సిలిండర్ తీసుకోమన్నారు. సిలిండర్ తీసుకోలేకపోయాను. సిలిండర్ డెలివరీ అయినట్లు ఫోన్‌కు మేసేజ్ వచ్చింది. నాకు ఇక ఈ నెల సిలిండర్ రానట్లే.

– అనంతమ్మ, గోవిందవాడ గ్రామం, బొమ్మనహాళ్ మండలం

అదనంగా వసూలు చేయరాదు



వినియోగదారుల నుంచి గ్యాస్ సిలిండర్ డెలివరీ చార్జీల పేరుతో అదనంగా వసూలు చేస్తే చర్యలు తప్పవు. వినియోగదారులు గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్స్‌కు అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదు. మా దృష్టికి వస్తే కేసులు నమోదు చేస్తాం. సిలిండర్ బుక్ చేసుకున్న తర్వాత రసీదులో వచ్చే మొత్తం మాత్రమే చెల్లించాలి. ఎక్కువ వసూలు చేస్తే మాకు ఫిర్యాదు చేయాలి. – మునివేలు, తహసీల్దార్

క్లుప్తంగా

మహాధర్నాకు స్వచ్ఛందంగా తరలిరండి

కళ్యాణదుర్గం రూరల్: ఆర్డీటీని కాపాడుకునేందుకు నిర్వహించే మహాధర్నాకు స్వచ్ఛందంగా తరలిరావాలని దళిత సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని ముద్దినాయపల్లి, కాపర్లపల్లి, పీటీఆర్ పల్లి, వర్లీ, కోడిపల్లి పాలవాయి గ్రామాల్లో దళిత సంఘాల నాయకులు పర్యటించి, కరపత్రాలు పంపిణీ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను రెన్యూవల్ చేయాలని ధర్నా చేయనున్నారు. నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున ప్రజలు పాల్గొని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడు అక్కులప్ప, దళిత నేతలు కొల్లాపురప్ప, నారాయణ, తిప్పేస్వామి, యల్లప్ప, తిప్పన్న, మారన్న పాల్గొన్నారు.

ఆర్డీటీని కలసికట్టుగా కాపాడుకుందాం



మహాధర్నాకు పిలుపునిస్తున్న ఆర్డీటీ పరిరక్షణ కమిటీ సభ్యులు

బ్రహ్మసముద్రం : ఆర్డీటీని కలసికట్టుగా కాపాడుకుందామని ఆర్డీటీ పరిరక్షణ సమితి సభ్యులు ఆదివారం పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే మహాధర్నాకు మండల వ్యాప్తంగా ఉన్న ఆర్డీటీ లబ్ధిదారులు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజలు స్వచ్ఛందంగా కలసిరావాలని వారు కోరారు.

ఉద్యోగ విరమణ సన్మానం



సత్యనారాయణను సత్కరిస్తున్న చైర్‌పర్సన్ శిల్ప, మాజీ చైర్మన్ ఉపేంద్రరెడ్డి

రాయదుర్గంటౌన్: పట్టణానికి చెందిన కె. సత్యనారాయణను ఆదివారం సన్మానించారు. స్థానిక రాయల్ డిగ్రీ కళాశాలలో సత్యనారాయణ ఉద్యోగ విరమణ సన్మాన సభ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కౌన్సిలర్లు, ప్రముఖులు హాజరై ఆయన్ను సన్మానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, మాజీ చైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, కౌన్సిలర్లు శారదాదేవి, గౌని లావణ్య, కో ఆప్షన్ సభ్యుడు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు గౌని శ్రీరామిరెడ్డి, రామాంజనేయులు, రిటైర్డ్ ఈఓ రామారావు, బేతంచెర్ల మున్సిపల్ కమిషనర్ హరి తదితరులు హాజరై సన్మానించారు.

17న నిరుద్యోగి ఆవేదన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

రాయదుర్గంటౌన్: అఖిల భారత యుజన సమైక్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17న విజయవాడలో జరిగే "నిరుద్యోగి ఆవేదన సదస్సు"ను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ రాయదుర్గం అధ్యక్షుడు కుమార్, కోశాధికారి నాగయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఏపీ ఎన్జీవో భవనంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు నిరుద్యోగ యువతను ఆకర్షించేందుకు కూటమి పార్టీలు సూపర్ సిక్స్ హామీలను ప్రచారం చేసి, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను గాలికొదిలేసినట్లు ధ్వజమెత్తారు. యువతను, నిరుద్యోగులను మోసం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. సమావేశంలో గోపి, గంగాధర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఓటేస్తే మోసపోవడం గ్యారెంటీ

డి.హీరేహాళ్ (బొమ్మనహాళ్): చంద్రబాబుకు ఓటేస్తే మోసపోవడం గ్యారెంటీ అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. రాయదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆదేశాల మేరకు డి.హీరేహాళ్ మండలంలోని మల్లికేతి, పులకుర్తి, హొసగుడ్డం గ్రామాల్లో బాబు షూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ సూపర్ సిక్స్ పథకాలు కుటుంబంలో ఎంతమందికి అందుతున్నాయనే విషయాలపై ఆరాతీశారు. నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్‌కే దిక్కులేకుండా పోయిందన్నారు. చంద్రబాబు సృష్టించిన సంపద, తెస్తున్న అప్పులు డబ్బంతా ఎటు వెళ్లిపోతోందని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీనియర్ నేత సుదర్శన్‌రెడ్డి, జిల్లా కమిటీ అధ్యక్షుడు సందీప్‌గౌడ్, తాలుకా బూత్ కమిటీ అధ్యక్షుడు అంజినరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు కురుబ హనుమంతరెడ్డి, సర్పంచులు మడేనహళ్లి ఆంజనేయ, మల్లికేతి మల్లికార్జున, ఎంపీటీసీ హొసగుడ్డం శివలింగప్ప, నాయకులు నాగ, తిమ్మప్ప, వెంకట్, విజయగౌడ్, కాదలూరు గంగిరెడ్డి, హనుమాపురం శివరామిరెడ్డి, కల్యం చిత్రయ్య, హంపన్నగౌడ్, సింగాడి మంజు, సురేష్, మల్లి, విరుపాక్షి, పరాంధామ, కాలవ తిప్పేస్వామి, శ్రీరంగారెడ్డి, ఓబులేసు, పరమేష్, కాలవ హనుమంతరెడ్డి, జగనాథ్, ఆనంద్, వన్నూరుస్వామి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పులకుర్తిలో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

దోమల నివారణకు ఫాగింగ్

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లులో దోమల నివారణకు ఫాగింగ్ చేయించిన్నట్లు సర్పంచ్ పరమేశ్వర తెలిపారు. గ్రామంలోని అన్ని కాలనీల్లో దోమల మందు పిచికారీ చేయించిన్నట్లు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షానికి దోమలు వృద్ధి చెందే ఆస్కారం ఉన్న నేపథ్యంలో ఫాగింగ్ చేయించారు.

పదోన్నతిపై ఎంపీడీఓ బదిలీ

గుమ్మఘట్ట: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పని చేస్తున్న రామకృష్ణ పదోన్నతిపై బదిలీ అయ్యారు. జిల్లా కేంద్రంలోని నీటి యాజమాన్య సంస్థలో పరిపాలన అధికారిగా బదిలీ అయినట్లు కార్యాలయ వర్గాలు ఆదివారం తెలిపాయి. ఈసందర్భంగా మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఎంపీడీఓకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కూడేరులో తాగునీరు వృథా



కలగల్ల రోడ్డులో వృథాగా పోతున్న తాగునీరు

కూడేరు: కూడేరులో కలగళ్ల రోడ్డులోని గ్యాస్ శివ ఇంటి వద్ద పంచాయతీ తాగునీటి సరఫరా పైపులైన్ లీకేజీతో నీరు వృథాగా పోతోంది. కానీ పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు రంగయ్య పర్యటన

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయ సిబ్బంది ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

పక్కదారి పట్టిన పాఠ్య పుస్తకాలు

కూడేరు: ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాల్లో మిగులు పుస్తకాలను కూడేరులోని ఎమ్మార్సీ సెంటర్ నుంచి గుట్టుచప్పుడు కాకుండా గుజరీకి తరలించినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇదంతా మండల విద్యాశాఖాధికారి కనుసన్నల్లోనే జరిగినట్లుగా ఉపాధ్యాయులు గుసగుసలాడుతున్నారు. మండలంలోని పాఠశాలల విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులకు అందజేసిన అనంతరం మిగులు పుస్తకాలను ఎమ్మార్సీలోనే నిల్వ చేశారు. త్వరలో రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు సరఫరా కానున్నాయి. ఈ క్రమంలో మొదటి సెమిస్టర్‌లో మిగులు పాఠ్యపుస్తకాలను విద్యాశాఖకు సంబంధించి జిల్లా కేంద్రంలో ఉన్న గోదాముకు తరలించాలి. అయితే ఇందుకు విరుద్ధంగా 15 రోజులు క్రితం గుజరీకి తరలించి సొమ్ము చేసుకున్నట్లుగా వదంతులు వ్యాపించాయి. ఈ విషయంపై ఎంఈఓ మహమ్మద్ గౌస్‌ను వివరణ కోరగా... తాను ఇన్‌చార్జ్ ఎంఈఓనని, ఒకరు రోజు అనంతపురంలోని స్కూల్‌కు మరొక రోజు మండలానికి హాజరవుతుంటానని పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాల సరఫరా, పంపిణీకి సంబంధించిన ప్రక్రియను ఎంఈఓ–2 సాయికృష్ణ చూసుకుంటారన్నారు. అయితే పాఠ్య పుస్తకాలు పక్కదారి పట్టిన విషయంపై విచారణ చేపట్టి వాస్తవాలు నిగ్గ తేలుస్తామని పేర్కొన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

గుమ్మఘట్ట: మండలంలోని వేపులపర్తి క్రాస్ వద్ద ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనం బోల్తా పడి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వేపులపర్తికి చెందిన వినయ్,జగదీష్ ద్విచక్ర వాహనంపై రాయదుర్గం నుంచి వెళ్తుండగా, ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడ్డారు. గాయపడిన వారిని స్థానికులు మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

ముద్దలాపురం చెరువుకు జలకళ

కూడేరు: మండలంలోని ముద్దలాపురం చెరువు నీటితో నిండి కళకళలాడుతోంది. గత నెల నుంచి ముద్దలాపురం చెరువులోకి జీడిపల్లి జలాశయం నుంచి హంద్రీ–నీవా సుజల స్రవంతి కాలువ ద్వారా కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నాయి. చెరువు పూర్తిగా నిండి మరువ పారుతోంది. ఆ నీరు వంక ద్వారా ప్రవహిస్తూ ఇప్పేరు చెరువులోకి చేరుతోంది.

తప్పిన పెను ప్రమాదం

కూడేరు: స్థానిక అనంత వెంకటరెడ్డి కాలనీ వద్ద అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పిల్లలు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు.. నగరానికి చెందిన ఓ కుటుంబం కారులో ఉరవకొండలోని చర్చికి వెళ్తోంది. అనంత వెంకటరెడ్డి కాలనీ వద్దకు రాగానే ముందు సీట్లో కూర్చున్న బాలుడు స్టీరింగ్ లాగడంతో అదుపుతప్పి హోటల్‌లోకి దూసుకెళ్లింది. దీంతో కారు ముందుభాగం దెబ్బతినింది. బెలూన్లు ఓపెన్‌కావడం, భార్యాభర్తలు సీటు బెల్టు పెట్టుకోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. హోటల్ వద్ద ఎవరూ లేకపోవడం కారులో ఉన్న వారికి ఏమి కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పిల్లలను ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

ఉపాధి పనుల్లో అవినీతిని అరికట్టాలి

కుందుర్పి: ఉపాధి పనుల్లో అవినీతిని అరికట్టాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హనుమంతరాయుడు, ఉపాధ్యక్షుడు భీమప్ప, సర్పంచ్ రామమూర్తి తదితరులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో టీడీపీ నియమించిన ఫీల్డ్ అసిస్టెంట్లు కొందరు పనుల్లో పాల్గొనకపోయినా మస్టర్లలో బోగస్ పేర్లు నమోదు చేసి, అక్రమాలకుపాల్పడ్డారన్నారు. అధికార పార్టీ అనుచరులకు మాత్రమే బిల్లులు చేస్తున్నట్లు తెలిపారు. జంబుగుంపల, మలయనూరు, ఎర్రగుంట, బసాపురం, కరిగానిపల్లి తదితర పంచాయతీల్లో ఉపాధి బిల్లుల విషయంలో అవినీతి జరిగినట్లు వారు తెలిపారు.

విద్యుదాఘాతంతో గొర్రెల మృతి

బొమ్మనహాళ్: హరేసముద్రం సమీపంలో విద్యుదాఘాతంతో ఆదివారం రెండు గొర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన ఏలంజి తిప్పయ్య దాదాపు 150 గొర్రెలు పెంచుతూ జీవనం సాగిస్తున్నాడు. గొర్రెలు మేతకోసం గ్రామ సమీపంలోని పొలం వద్దకు వెళ్లగా, అక్కడ విద్యుత్ స్తంభానికి ఉన్న స్టేవైరుకు తాకగానే విద్యుత్ షాక్‌కు గురై గొర్రెలు మృతి చెందాయి. దాదాపు రూ.36 వేలు నష్టపోయినట్లు బాధితుడు తెలిపాడు.



డిగ్రీ కళాశాలలో ఒకే వేదికపై కలిసిన పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

'అపూర్వ' సమ్మేళనం

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2005–08 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. 70 మంది పూర్వ విద్యార్థులు, గురువులు హాజరయ్యారు. ప్రస్తుతం వివిధ ప్రభుత్వ, ప్రైవేట్, వ్యాపారాలు, వివిధ వృత్తుల్లో స్థానికంగానే కాకుండా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. సమ్మేళన సమావేశంలో గురువులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. సమ్మేళానికి పూర్వ విద్యార్థులు అంజి, శ్రీరామ్, ఉమేష్, బీటీపీ గోవిందు, సోము, శివ, లక్ష్మీ, మాలతి, సుధ, నందిని, అర్చన తదితరులు అందరినీ సమీకరించారు. పూర్వవిద్యార్థులంతా కలిసి కళాశాలకు సరస్వతీ విగ్రహాన్ని అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు బాబు, రాధాకృష్ణ, వెంకటేష్, నారాయణస్వామి పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ మేధావి

మోక్షగుండం

- నేడు విశ్వేశ్వరయ్య జయంతి
- ఇంజనీర్స్ డే నిర్వహించనున్న కళాశాలలు



జేఎన్‌టీయూ కళాశాల

అనంతపురం / అనంతపురం కల్చరల్: దేశ సమగ్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించే ఇంజనీర్లకు మార్గదర్శిగా, భారతజాతి కీర్తి ప్రతిష్టలు సుసంపన్నం చేసిన మహోన్నత వ్యక్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ఆయన చేసిన సేవలు చిరస్మరణీయంగా మిగిలిపోయాయి. ఏటా సెప్టెంబర్ 15న మోక్షగుండం జయంతి సందర్భంగా ఇంజనీర్స్ డేను జరుపుకుంటారు.

కరువు సీమలో సాంకేతిక కల్పతరువు..

మోక్షగుండం స్ఫూర్తితో ఆయన అందించిన ప్రేరణతో దేశమంతటా అపురూప కట్టడాలు రూపుదిద్దుకున్నాయి. అనంతలోనూ నాటి ఇంజినీరింగ్ ప్రతిభకు అద్దం పట్టే కట్టడాలు ఎన్నో ఉన్నాయి. ఆర్ట్స్ కాలేజీ, జిల్లా కోర్టు ప్రాంగణం, రెవెన్యూ భవనాలు చెక్కుచెదరని, అద్భుత కట్టడాలుగా నిలిచాయి. అందులో అనంత కరువు సీమలో సాంకేతిక కల్పతరువుగా భాసిల్లుతున్న జేఎన్‌టీయూఏ 1949లో ప్రారంభమైంది. 2008లో వర్సిటీగా ఆవిర్భవించింది. ఏటా 90 వేల మందికి పైగా విద్యార్థులు జేఎన్‌టీయూ పరిధిలో చదువుకుంటూ భావి ఇంజినీర్లుగా వస్తున్నారు. వైఎస్సార్ సీఎం కాకమునుపు నూటికొకరు ఇంజినీర్లు ఉండేవారు. ఇంజినీర్ కావాలన్న ప్రతి ఒక్కరి కల సాకారం చేసిన ఘనత వైఎస్సార్‌దే. ఆయన హయాంలో ఇంజినీరింగ్ కళాశాలలను విరివిగా పెంచారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించి ఎందరినో ఉన్నత విద్యావంతులను చేశారు. ప్రతిభావంతులైన అనంతపురం ఇంజినీర్లు వినూత్న ఆవిష్కరణలతో రాష్ట్రంలోనే తలమానికంగా నిలిచారు. ప్రస్తుత రోజుల్లో కేవలం ఇంజినీరింగ్ మాత్రమే ప్రధాన ఉపాధిగా మారడం వెనుక ఆయన కృషి అపారం.